# మహా సభను విజయవంతం చేద్దాం

- బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్
- ఏడో వార్డులో సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



లాల్‌బజార్‌లో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్, పార్టీ నాయకులు

బొల్లారం, ఏప్రిల్ 21: ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ ఏడో వార్డు బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యాంకుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశానికి నాగేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఎండ్ల ఉద్యమగుర్తులు, తెలంగాణ అభివృద్ధి గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు హామీలకే పరిమితమైందని, అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ కేసీఆర్ పాలనను ప్రజలు మర్చిపోలేక పోతున్నారని తెలిపారు. మరో మారు కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తిరుమలగిరి నుండి బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ అధ్యక్షతన కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు. సభకు బయలుదేరే ముందు ప్రతి బస్తీ, కాలనీలో గులాబీ జెండాను ఎగుర వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్, యశ్వంత్ కుమార్, కురుమయ్య, సువర్ణ, మేరీ, విజయ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేయాలి

మారేడ్‌పల్లి: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్‌లో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పెయింట్ కార్యాక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏండ్లలో ఎన్నో విజయాలను కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నమోదు చేసుకుందని, రాబోయే రోజుల్లో అధికారం చేపట్టి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం తథ్యమన్నారు. ప్రతిగడప నుంచి సభకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శత్రు, శేఖర్, నల్లా రాజు, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేటర్ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్

అడ్డగుట్ట: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27దీన జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మెట్టుగూడలో వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొని మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

### చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

బన్సీలాల్‌పేట్: ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ 25 ఏండ్ల రజతోత్సవ సభకు సంబంధించిన చలో వరంగల్ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకుడు తలసాని రవీందర్ యాదవ్ (స్కైలాబ్) విడుదల చేశారు. బన్సీలాల్ పేట్ డివిజన్ నాయకులు లక్ష్మీపతి, విజయశంకర్, దేశపాక శ్రీను, శాంతి కుమార్, రాజేందర్, ఏసూరి శ్రీనివాస్, అబ్బాస్, జ్ఞాని, అరుణ్‌గౌడ్, కృష్ణ, కుమార్‌యాదవ్, రాహుల్, అనిల్, నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత



చలో వరంగల్ పోస్టర్లను విడుదల చేసిన బీఆర్ఎస్ నాయకుడు తలసాని రవీందర్ యాదవ్ (స్కైలాబ్)




పికెట్‌లో రజతోత్సవ సభ వాల్ పెయింట్ వేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్, నాయకులు

## డేటా సైన్స్ కోర్సు పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని డేటా సైన్స్ కోర్సు పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

## ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 26వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## దూరవిద్య పీజీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

## డబుల్ ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి



హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఇండ్ల సమస్యను వివరిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 21: సికింద్రాబాద్ హమాలీబస్తీలో పెండింగ్ ఉన్న డబుల్ బెడ్రూంలు లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టిని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. గత ప్రభుత్వంలో డిగ్నిటీ హౌసింగ్ స్కీమ్ నిర్మించి ఇచ్చిన వాటిలో 65 ఇండ్లు ఇవ్వకుండా ప్రభుత్వం నిలిపివేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో 65 ఇండ్లకు సంబందించిన లబ్ధిదారులు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, సభ్యులును సంప్రదించగా సోమవారం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాధం బాలరాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్‌ను కలిసి 65 ఇండ్ల లబ్ధిదారులా పత్రాలను పరిశీలించి అందులో మిగిలిన పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు తలిపారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఆర్డీఓ సాయిరామ్ ఇతర అధికారులతో మాట్లాడి 15 రోజుల్లోగా లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు శైలందర్, శ్రీకాంత్‌రెడ్డి, అజీజ్ తోపాటు లబ్ధిదారులు అంజయ్య, జమున, రవికుమార్, నర్సింగరావ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆశ్రమవాసుల సౌకర్యార్థం సిమెంట్ రోడ్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ

మాదాపూర్, ఏప్రిల్ 21: కొండాపూర్ లోని సీఆర్ ఫౌండేషన్ లో సీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న హోం ఫర్ ఏజ్డ్ కు మల్లంపాటి సోదరుల ఆర్థిక సహాయంతో సిమెంట్ రోడ్ నిర్మించారు. సోమవారం సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, డా.కె.నారాయణ హాజరై అగస్త్య ఆగ్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లంపాటి మురళి, మల్లంపాటి వెంకటేశ్వరరావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చల్ల రాజేశ్వరరావు ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించడం సంతోషాన్నిచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు ఎన్.రాజేంద్ర రావు, సీఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ వి.చెన్నకేశవరావు, టి.తన్య, డాక్టర్ గోపీచంద్, సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, మిసిబి మాసపత్రిక ఎడిటర్ వల్లభనేని అశ్విని కుమార్, ఆశ్రమ వాసులు, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ



అమర్‌నాథ్ యాత్రికులకు మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న గాంధీ దవాఖాన వైద్యులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 21: అమర్‌నాథ్ యాత్రికులకు గాంధీ దవాఖానలో మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సోమవారం మొదలైంది. ప్రధాన భవనం మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డ్స్ విభాగంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి పర్యవేక్షణలో ప్రభుత్వం నియమించిన నలుగురు వైద్య ప్రొఫెసర్ల బృందం దరఖాస్తుదారుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, ఎక్స్ రే రిపోర్ట్‌లను పరిశీలించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నవారికి ఫిట్నెస్ సర్టిఫికెట్లను జారీ చేశారు. సోమవారం సర్టిఫికెట్ల కోసం వచ్చిన ప్రజలతో ఎంఆర్డీ సెక్షన్ కిక్కిరిసిపోయింది. ఇది పూర్తిగా ఉచితమని, ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో సర్టిఫికెట్లు జారీ చేస్తామని అధికారులు తెలిపారు.

## సంఘ సేవకుడు కందూర్ కృష్ణకు సేవా అవార్డు



కందుల కృష్ణకు అవార్డును అందజేస్తున్న శ్రీనివాసచారి

చిక్కడపల్లి, ఏప్రిల్ 21: ప్రముఖ సంఘ సేవకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కందూర్ కృష్ణకు ఆయన చేసిన సేవలకు సేవా అవార్డు దక్కింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ శ్రీనివాసచారి చేతుల మీదుగా కందూరు కృష్ణ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కందూర్ కృష్ణ ఫౌండేషన్, సెట్ మాణిక్ లాల్ అగర్వాల్ ఫౌండేషన్ సహకారంతో ప్రతిరోజు ఉదయం వందలాది మందికి అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తన సేవలను గుర్తించి అవార్డు రావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్.కె.రామానందం, డిస్టిక్ గవర్నర్- 2025 లింగప్రకాష్, వెండి దాత, వి.నాగభూషణం, ఎస్.కృష్ణకుమారి, టి.చక్రపాణి, బి.గంగాధర్‌రెడ్డి, జి.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించాలి



అల్లాపూర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లయన్స్ క్లబ్ ఆఫ్ పర్యావరణ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నెం కోటి రెడ్డి అన్నారు. వ్యాపార సముదాయాలు, రైతు మార్కెట్లలో వినియోగదారులకు జ్యూట్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. కోటిరెడ్డి మాట్లాడుతూ..పర్యావరణాన్ని హాని చేసే ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, జూట్ బ్యాగులను వాడాలని సూచించారు.

### చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు

దుండిగల్ : ఈ నెల 24 నుంచి మే 20 వరకు నిజాంపేటలోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనంపై వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు స్కూల్ వ్యవస్థాపకులు సత్య వోలు రాంబాబు తెలిపారు. నిజాంపేట్, బాలాజీ నగర్ లోని కృష్ణారెసిడెన్సీ నందు సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో ఐదేండ్ల నుంచి పెద్దవారి వరకు నేర్చుకోవచ్చు అని తెలిపారు. వివరాలకు 9959971679 / 9849490663 నంబర్లలో సంప్రదించా లని సత్య వోలు రాంబాబు కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో.. సీమంతం

రహమత్ నగర్ డివిజన్ బ్రహ్మశంకర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భవతులకు సీమంతం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు, పండ్లు, చీర, గాజులతో సంప్రదాయ బద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

– జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21

## ఒప్పందాలు ఆపకపోతే దేశ వ్యాప్త సమరశీల పోరాటాలు





నిరసనలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి, కాంతయ్య, జడ సత్యనారాయణ, రవీందర్‌గౌడ్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 21: వ్యవసాయం పాడి పరిశ్రమ చేపలు పట్టడంలో అమెరికాతో భారత ప్రభుత్వం అసమాన ఒప్పందాలు చేసుకుంటే దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సిద్ధమని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి, కాంతయ్య, జడ సత్యనారాయణ, రవీందర్ గౌడ్ పిలుపునిచ్చారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆస్ట్రేలియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం, నిర్దిష్ట పరిమాణంలో కందులు, శనగపప్పు దిగుమతులపై జీరో-డ్యూటీ భారత్ ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేసిందన్నారు. అమెరికన్ రైతులకు భారీ సబ్సిడీ ఇస్తూ, మన దేశంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అంటే అసమానంగా ఉంటుందని తెలిపారు. సుంకాలు, మార్కెట్ పరిమితులను ఎత్తివేస్తే భారత్‌కు అమెరికా పాల ఎగుమతులు భారీగా పెరుగుతాయని ఇది పాడి రైతుల మరణానికి కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ముప్పు పాడి రంగానికే పరిమితం కాదని వివరించారు. అదేవిధంగా మొక్కజొన్న విషయంలో జన్యుపరంగా మార్పు చెందిన మొక్కజొన్న, ఇథనాల్‌పై భారత్ దిగుమతి నిషేధాన్ని తొలగించాలనే ఒత్తిడి ఉందని తెలిపారు. దీని వల్ల అమెరికాకు 300 మిలియన్ డాలర్లు ఆకస్మిక లాభాలు వస్తాయని చెప్పారు. సోయాబీన్, బాదం, పిస్తా, వాల్‌నట్, ఆపిల్ తోపాటు ఉద్యాన పంటలు అన్నీ చర్చల కోసం సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. భారతీయ పత్తి రైతులు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యూఎస్ ట్రేడ్ డెలిగేషన్ సందర్శన సందర్భంగా భారత ప్రభుత్వం బోల్‌గార్డ్ యొక్క గరిష్ట రిటైల్ ధరను 450 గ్రాముల ప్యాకెట్‌కు రూ.48 పెంచిందని, సగటున ఏడాదికి 4.5 కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతున్నందున పెద్ద వ్యవసాయ వ్యాపారాలకు ఎంత భారీ లాభాలు వస్తాయో ఊహించవచ్చు అన్నారు. ప్రధాని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఎవరి ప్రయోజనాలను తీరుస్తున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు కూరపాటి రమేష్, శ్రీకాంత్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నెల బాలకృష్ణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంజనేయులు, శివ కుమార్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ఫొటోలు మార్ఫింగ్

### సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యనాయకుల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ తప్పుడు రీతిలో పోస్ట్ చేస్తున్న సోషల్ మీడియా అకౌంట్స్‌లో పాటు వాటిని షేర్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సైబర్ క్రైం ఏసీపీ శివమూర్తి కుమార్‌ను కలిసి ఫిర్యాదు అందజేసిన అనంతరం మన్నె గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు రజతోత్సవ సభకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వాల్ రైటింగ్, పోస్టర్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గోడలపై రాసిన చలో వరంగల్ నినాదాల స్థానంలో అభ్యంతరకరమైన రీతిలో మార్ఫింగ్ చేసి కాంగ్రెస్ పార్టీ నేతలు షేర్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తదితరులపై ఇలాంటి పోస్టింగ్‌లు పెట్టిన ట్విట్టర్ హ్యాండిల్ ‘ తెలంగాణగళం’తో పాటు ఇతర వ్యక్తులు, అకౌంట్స్ మీద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాంచందర్, రావుల విజయ్‌కుమార్, సారంగపాణి, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ క్రైం ఏసీపీ శివమూర్తి కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

## ట్రాలీ ఆటో చోరీ

### మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు, కేసు నమోదు

వెంగళరావునగర్, ఏప్రిల్ 21 : ఇంటి సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన ట్రాలీ ఆటోను దొంగలు అపహరించుకెళ్లిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కు చెందిన ఆర్. శ్రీకాంత్ టెంట్ హౌస్ నిర్వహిస్తుంటాడు. ఈనెల 19న మధ్యాహ్న 2:30 గంటలకు తన టాటా ఏస్ ట్రాలీ ఆటో ను మధురానగర్ లోని తన ఇంటి సమీపంలో ఉన్న యూనివర్సల్ హోటల్ ఎదురుగా పార్క్ చేసి ఇంటికెళ్లాడు. కాగా మరుసటి రోజు రాత్రి పార్కిం గ్ చేసిన ట్రాలీ ఆటో కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాధితుడు శ్రీకాంత్ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంట్లోకి చొరబడి .. కత్తులతో బెదిరించి..

బండ్లగూడ, ఏప్రిల్ 21. నగర శివారు ప్రాంతాల్లో దొంగలు హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో దొంగతనాలు చేసే దొంగలు ఇప్పుడు పన్నాగం మార్చి ఉదయం వేళలో కూడా ఇండ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్ టీ కాలనీలో కారులో దర్జాగా వచ్చి తెలిసినవారిగా ఇంట్లోకి చొరబడి కత్తులతో భయపెట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్‌పోలీస్ తులా శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం. పీ అండ్ టీ కాలనీలో నివాసముండే జాకీర్ ఆలీ ఇంటికి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఓ షిఫ్ట్ డిజైర్ కారులో గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులు తట్టారు. జాకీర్ ఆలీ తలుపులు తీసేసరికి ఒకసారిగా ఇంట్లోకి ప్రవేశించి కత్తులు మారుణాయుధాలతో జాకీర్ ఆలీ దంపతులను బెదిరించారు. బీరువా తలుపులు తెరవాలని ఆజ్ఞాపించడంతో బీరువా తలుపులు తెరవగానే అందులో ఉన్న ఆరు తులాల బంగారం, 20 తులాల వెండి, 20వేల నగదును ఎత్తుకొని పారిపోయారు. జాకీర్ ఆలీ తేరుకొని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని ఏసీపీ తులా శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూస్ టీం తో వివరాలను సేకరించారు. జాకీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.